ప్రజ్వలిస్తున్న ప్రతీకారం

- ఇజ్రాయెల్‌పై 100 రాకెట్లతో హెజ్బొల్లా దాడి
- లెబనాన్‌పై జరిగిన దాడికి బదులుగా ప్రయోగం
- ఇరు ప్రాంతాల్లో ముదురుతున్న ఉద్రిక్తతలు

నహరియా (ఇజ్రాయెల్), సెప్టెంబర్ 22: ఇజ్రాయెల్-లెబనాన్ పరస్పర తీవ్రంగా దాడులు చేసుకొంటున్నాయి. ఉత్తర ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాలపై హెజ్బొల్లా ఆదివారం ఉదయం వంద రాకెట్లతో విరుచుకుపడింది. ఇందులో కొన్ని రాకెట్లు ఇజ్రాయెల్‌లోని హైఫా నగరంలో పౌర నివాసాలపై పడ్డాయి. ఈ దాడిలో నలుగురు గాయపడగా, పలు భవనాలు, నివాస ప్రాంతాలు దెబ్బతిన్నాయని, పలు వాహనాలకు నిప్పు అంటుకున్నట్లు ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు. ఈ దాడిపై ఇజ్రాయెల్ రాత్రే అప్రమత్తమైంది. ఉత్తర ఇజ్రాయెల్‌లో రాత్రి నుంచి సైరన్‌ల ద్వారా పౌరులను అప్రమత్తం చేసి, సురక్షిత, పునరావాస ప్రాంతాలకు తరలించింది. కాగా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ శుక్రవారం యుద్ధ విమానాలతో జరిపిన విస్తృత దాడుల్లో బీరుట్‌లో ఒక హెజ్బొల్లా అగ్రనేత సహా 45 మంది పౌరులు మరణించారు. శనివారం లెబనాన్‌లో 400 మిలిటెంట్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని రాకెట్లతో దాడి చేసినట్టు ఇజ్రాయెల్ లెఫ్టినెంట్ కల్నల్ నాదడ్ షోషాని తెలిపారు. దీనికి ప్రతీకారంగా హెజ్బొల్లా ప్రతిదాడులకు పూనుకుంది.

ఆదివారం హెజ్బొల్లా రాకెట్ దాడిలో ధ్వంసమైన ఇజ్రాయెల్‌లోని ఓ ప్రాంతం

హెజ్బొల్లాను తీవ్రంగా దెబ్బతీశాం

యుద్ధంలో ఇప్పటికే హెజ్బొల్లాను తీవ్రంగా దెబ్బతీశామని, ఒక వేళ హెజ్బొల్లా తమ సందేశాన్ని కనుక అర్థం చేసుకోకపోతే ఇప్పుడు అర్థం చేసుకుంటుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ అన్నారు. రానున్న పరిణామాలు తీవ్రంగా ఉంటాయని, తమ దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు. ఇజ్రాయెల్ మిలటరీ శనివారం 290 లక్ష్యాలను ఛేదించినట్టు ఆయన చెప్పారు.

అల్ జజీరా కార్యాలయం మూసివేత

ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని శాటిలైట్ న్యూస్ నెట్‌వర్క్ అల్ జజీరా కార్యాలయాలపై ఇజ్రాయెల్ సేనలు ఆదివారం దాడులకు దిగాయి. రామల్లాలోని దాని బ్యూరో కార్యాలయాన్ని మూసివేయించాయి. అక్కడ ఉన్న సామగ్రిని సీజ్ చేశాయి. వాటి ప్రసారాలను, వెబ్‌సైట్లను బ్లాక్ చేయించాయి. అయినప్పటికీ అల్ జజీరా వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్‌ల నుంచి తమ వార్తా ప్రసారాలను కొనసాగించింది. విదేశీ గడ్డపై ఉన్న ఒక వార్తా సంస్థను ఇజ్రాయెల్ ఇలా మూసి వేయించడం ఇదే తొలిసారి. ఇజ్రాయెల్ ఈ విషయాన్ని అంగీకరించింది కూడా.

ఐఫోన్లు, ఆపిల్ ఉత్పత్తులు సేఫ్ కాదు

వెంటనే కొత్త ఓఎస్‌తో అప్‌డేట్ చేసుకొమ్మని కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ: ఆపిల్ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఐఫోన్ 16 సిరీస్ లాంచ్ అయింది. అభిమానులు ఎప్పట్లానే ఎగబడి వాటిని కొనుగోలు చేశారు. మిగతా కంపెనీల ఉత్పత్తులతో పోలిస్తే భద్రత పరంగా ఇవి అత్యుత్తమమైనవిగా భావిస్తారు. అందుకే ఖర్చుతో సంబంధం లేకుండా వాటిని సొంతం చేసుకునేందుకు ఇష్టపడతారు. అయితే, అవి కూడా అంత సురక్షితం ఏమీ కాదని, వాటిలోనూ బోల్డన్ని భద్రతా లోపాలు ఉన్నట్టు కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సీఈఆర్‌టీ-ఇన్) హై రిస్క్ వార్నింగ్ జారీ చేసింది. ఐవోఎస్, ఐపాడ్ ఓఎస్, మ్యాక్‌ఓఎస్, వాచ్ ఓఎస్, విజన్ ఓఎస్‌లలో భద్రతా పరమైన లోపాలు ఉన్నట్టు పేర్కొంది. ఫలితంగా ప్రభావితమయ్యే వాటిలో ఐవోస్ 18, 17.7కు ముందు వెర్షన్లు, ఐపాడ్‌ఓఎస్‌లో 18, 17.7, మ్యాక్‌ఓఎస్ సోనోమాలో 14.7, మ్యాక్‌ఓఎస్ వెంచురాలో 13.7, మ్యాక్ ఓఎస్ సీక్వోయాలో 15, టీవీఓఎస్‌లో 18, వాచ్ ఓఎస్‌లో 11, సఫారీలో 18, ఎక్స్‌కోడ్‌లో 16, విజన్ ఓఎస్‌లో 2కు ముందు వెర్షన్లు ఉన్నాయి. వీటికి హ్యాకింగ్ ముప్పు పొంచి ఉన్నదని, కాబట్టి వీలైనంత త్వరగా తాజా సాఫ్ట్‌వేర్ వెర్షన్లతో అప్‌డేట్ చేసుకోవాలని సీఈఆర్‌టీ కోరింది.

అధిక పని ఒత్తిడికి మరొకరు బలి

తమిళనాడులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

చెన్నై, సెప్టెంబర్ 22: అధిక పని ఒత్తిడి కారణంగా 'ఎర్నెస్ట్ అండ్ యంగ్'లో ఓ ఉద్యోగిని హఠాన్మరణం చెందిందన్న వార్త సర్వత్రా షాక్‌కు గురి చేసింది. తాజాగా ఇలాంటిదే మరో ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. ఉద్యోగంలో పని ఒత్తిడికి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలయ్యాడు. గత కొద్ది నెలలుగా తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కార్తికేయన్(38) గురువారం కరెంట్ షాక్‌తో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటికి విద్యుత్తు తీగలను చుట్టుకొని కరెంట్ షాక్‌తో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని తాజంబూర్ పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిసింది. తమిళనాడులోని పల్లవరంలో 15 ఏండ్లుగా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న అతడు, పని ఒత్తిడి కారణంగా గత రెండు నెలలుగా తీవ్రమైన డిప్రెషన్‌కు గురయ్యాడని, ఇందుకు సంబంధించి చికిత్స కూడా తీసుకుంటున్నట్టు పోలీసులు చెప్పారు.

నన్ను జైల్లోనే చంపుతామన్నారు

- ఈడీ అనేక ఇబ్బందులకు గురి చేసింది
- ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం సిసోడియా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించి జైల్లో ఉన్న సమయంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి, ఈడీ వేధింపుల గురించి ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా తీవ్ర ఆరోపణలు చేశారు. పార్టీ మారకపోతే తనను జైల్లోనే చంపేస్తామని కొందరు చెదిరించారన్నారు. ఆదివారం ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ నిర్వహించిన జనతా కీ అదాలత్‌లో సిసోదియా మాట్లాడారు. 'కోర్టు ముందు కేజ్రీవాల్ పేరు చెప్తే నన్ను కాపాడతామని అన్నారు. తమ పార్టీలో చేరాలని బీజేపీకి చెందిన వారి నుంచి ఒత్తిడి వచ్చింది' అని సిసోడియా అన్నారు. తన ఆస్తులన్నింటినీ ఈడీ స్తంభింపచేయడంతో తన కుమారుడి కాలేజీ ఫీజు కోసం పలువురిని యాచించాల్సి వచ్చిందని విమర్శించారు. జైలులో ఉన్న సమయంలో తనను మానసికంగా, రాజకీయంగా నాశనం చేయడానికి ఈడీ ప్రయత్నించిందని ఆరోపించారు.

నెట్‌ఫ్లిక్స్‌పై జాతి వివక్ష
వీసా ఉల్లంఘన ఆరోపణలు

కేంద్రం విచారణ

న్యూఢిల్లీ: ఇంటిపాల్లిదికి వినోదాన్ని పంచే నెట్‌ఫ్లిక్స్ చిక్కుల్లో పడింది. జాతి వివక్ష, వీసా ఉల్లంఘనకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ యూఎస్ స్ట్రీమింగ్ దిగ్గజంపై భారత ప్రభుత్వం దర్యాప్తు జరుపుతున్నట్టు తెలిసింది. ఆ సంస్థ ఇండియా బిజినెస్, లీగల్ అఫైర్స్ మాజీ డైరెక్టర్ నందినీ మెహతాకు 20 జూలై 2020లో పంపిన ఈ-మెయిల్‌లో పేర్కొన్న ఈ విషయం తాజాగా వెలుగు చూసింది. భారత్‌లో నెట్‌ఫ్లిక్స్ తన కార్యకలాపాల నిర్వహణలో ప్రవర్తనా నియమావళితోపాటు వీసా నిబంధనల ఉల్లంఘన, చట్ట విరుద్ధ నిర్మాణాలు, జాతి వివక్ష వంటి చర్యలకు పాల్పడినట్టు హోం శాఖలోని ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్ఆర్ఆర్ఓ)కు చెందిన భారత అధికారి దీపక్ యాదవ్ లేఖ రాశారు. మరోవైపు, నెట్‌ఫ్లిక్స్ తనను అన్యాయంగా తొలగించిందంటూ నందినీ మెహతా ఆరోపించారు. ఇందుకు సంబంధించి నెట్‌ఫ్లిక్స్‌పై అమెరికా కోర్టులో పోరాటం కొనసాగిస్తున్నట్టు చెప్పారు. భారత ప్రభుత్వ దర్యాప్తును స్వాగతిస్తున్నట్టు చెప్పిన మెహతా.. ఆ నివేదికను బయట పెట్టాలని కోరారు. కాగా, నెట్‌ఫ్లిక్స్ మాత్రం జాతి, లింగ వివక్ష ఆరోపణలను తోసిపుచ్చింది. భారత ప్రభుత్వ దర్యాప్తు గురించి తమకు తెలియదని ఆ సంస్థ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

శ్రీలంక అధ్యక్షుడిగా దిసనాయకే విజయం

రెండో ప్రాధాన్య ఓట్లతో గెలుపు.. నేడు ప్రమాణ స్వీకారం

కొలంబో: శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో మార్క్సిస్ట్ నేత అనుర కుమార దిసనాయకే (56) విజయం సాధించినట్లు ఎన్నికల కమిషన్ ఆదివారం ప్రకటించింది. శనివారం జరిగిన ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో ఎవరికీ 50 శాతానికిపైగా ఓట్లు రాలేదు. దీంతో రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించి ఈ ఫలితాన్ని ప్రకటించారు. దిస్సనాయకే మార్క్సిస్ట్ జనతా విముక్తి పెరమున పార్టీ నేత. మరికొన్ని పార్టీలతో కలిసి నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) పేరుతో ఎన్నికల్లో పోటీ చేశారు. సమగి జన బలవేగయ (ఎస్‌జేబీ) నేత సాజిత్ ప్రేమదాసపై దిసనాయకే గెలిచారు. శ్రీలంక అధ్యక్షునిగా దిసనాయకే సోమవారం ప్రమాణ స్వీకారం చేస్తారని ఎన్‌పీపీ ప్రకటించింది. ''ప్రెసిడెంట్ అనుర దిసనాయకే, ప్రియమైన బిడ్డ శ్రీలంకను మీ సంరక్షణకు అప్పగిస్తున్నాను'' అని దిసనాయకేను ఉద్దేశించి విక్రమసింఘే ఒక ప్రకటనలోతెలిపారు.

విద్యార్థి రాజకీయాల నుంచి ఎదిగి...

శ్రీలంక రాజకీయాల్లో పెను సంచలనంగా మారిన అనుర కుమార దిసనాయకే డిగ్రీ చదువుతున్నప్పుడు సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్‌లో చేరి, విద్యార్థి రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. 1987లో మార్క్సిస్ట్ ప్రభావిత జనతా విముక్తి పెరమున (జేవీపీ) పార్టీలో చేరారు. 2004లో శ్రీలంక ఫ్రీడమ్ పార్టీతో కలిసి జేవీపీ ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. శ్రీలంకలో 2022లో ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో ప్రజల అసంతృప్తిని ఆయుధంగా మలచుకున్నారు. మార్పు, అవినీతి రహిత సమాజ నిర్మాణం వంటి నినాదాలతో జనాదరణ పొందారు. ఎన్నికల ప్రసంగాల్లో గత పాలకుల అవినీతి, వైఫల్యాల గురించి వివరించడంతోపాటు, దేశంలో జవాబుదారీతనం, వ్యవస్థాగత మార్పులు రావాలని గట్టిగా చెప్పారు.

టిక్కెట్ లేని ప్రయాణికులపై చర్యలు

పండుగ సీజన్‌లో తనిఖీలకు రైల్వే సిద్ధం

న్యూఢిల్లీ: పండుగల సమయాల్లో టిక్కెట్ లేకుండా రైళ్లలో ప్రయాణించేవారిని నిరోధించేందుకు రైల్వే శాఖ సమాయత్తమవుతున్నది. టిక్కెట్ లేకుండా ప్రయాణించే పోలీసులపై కూడా చర్యలకు సిద్ధమవుతున్నది. రైల్వే శాఖ ఈ నెల 20న దేశంలోని 17 జోన్ల జనరల్ మేనేజర్లకు రాసిన లేఖలో దీనికి సంబంధించిన ఆదేశాలను జారీ చేసింది. టిక్కెట్ లేకుండా, అనధికారికంగా రైళ్లలో ప్రయాణించేవారిపై రైల్వే చట్టం, 1989 ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీని కోసం వచ్చే నెల 1 నుంచి 15 వరకు, వచ్చే నెల 25 నుంచి నవంబరు 10 వరకు ప్రత్యేక తనిఖీలను నిర్వహించాలని చెప్పింది. టిక్కెట్ లేని ప్రయాణికుల్ని గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపింది.

అమెరికాలో తుపాకీ కాల్పులు

నలుగురి మృతి

బర్మింగ్‌హామ్: పసందైన విందు, వినోదాలను పంచిపెట్టే బార్లు, రెస్టారెంట్లతో కళకళలాడే ప్రాంతంలో శనివారం రాత్రి దారుణం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో నలుగురు మరణించగా, 21 మంది గాయపడ్డారు. అమెరికాలోని అలబామా, బర్మింగ్‌హామ్‌లో ఉన్న ఫైవ్ పాయింట్స్ సౌత్ ఏరియాలో ఈ సంఘటన జరిగింది. బర్మింగ్‌హామ్ అధికారి ట్రుమన్ ఫిట్జ్‌గెరాల్డ్ మాట్లాడుతూ, కాల్పుల్లో గాయపడ్డ నలుగురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ప్రజలను బలి తీసుకున్నవారిని గుర్తించి, పట్టుకునేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తామని చెప్పారు. రెస్టారెంట్లు, బార్లు, ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్లు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో వారాంతాల్లో రద్దీగా ఉంటుంది.

హర్యానాలో బీజేపీ ఓటమికి రైతు సంఘాల పిలుపు

కురుక్షేత్ర: హర్యానా శాసన సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని రైతు సంఘాలు ఆదివారం పిలుపునిచ్చాయి. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో పలు రైతు సంఘాలు పిప్లిలో నిర్వహించిన కిసాన్ మహాపంచాయత్‌లో ఈ నిర్ణయం తీసుకున్నాయి. వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం వంటి తమ డిమాండ్ల సాధన కోసం వచ్చే నెల 3న దేశవ్యాప్తంగా రైల్ రోకో నిర్వహించాలని కూడా నిర్ణయించాయి. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చిన రైతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రైతు నేత సర్వన్ సింగ్ పంధేర్ మాట్లాడుతూ, హర్యానాలో బీజేపీ దురాగతాలకు ప్రతీకారం తీర్చుకోవలసిన సమయం ఆసన్నమైందన్నారు.

బీటెక్ విద్యార్థులకు 50 ఇండో పసిఫిక్ స్కాలర్‌షిప్‌లు

న్యూయార్క్: క్వాడ్ కూటమి దేశాలు తమ ప్రజల మధ్య సన్నిహిత సంబంధాల బలోపేతానికి చర్యలు ప్రారంభించాయి. ఇందులో భాగంగా క్వాడ్ భాగస్వామ్య దేశంగా భారత ప్రధాని చొరవ తీసుకున్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంత దేశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు అయిదు లక్షల డాలర్ల క్వాడ్ స్కాలర్ షిప్ ప్రకటించారు. భారత ప్రభుత్వ నిధులతో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కాలేజీల్లో నాలుగేండ్ల బీటెక్ కోర్సు పూర్తి చేసే ఇండో-పసిఫిక్ ప్రాంత విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ అందిస్తారు.

నన్ను అవినీతిపరుడిగా చూపేందుకు ప్రధాని కుట్ర

- నేను నిజాయితీపరుడిని కాదని భావిస్తే ఓటేయకండి
- ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: తనను అవినీతిపరుడిగా నిరూపించేందుకు ప్రధాని మోదీ కుట్ర పన్నారని ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన జనతా కీ ఆందోళన్‌లో ఆయన మాట్లాడుతూ 'నన్ను, మనీశ్ సిసోడియాను అవినీతిపరులుగా చూపేందుకు ప్రధాని కుట్ర పన్నారు. పదేండ్లు సీఎంగా ఉన్నా తనకు ఢిల్లీలో సొంత ఇల్లు లేదన్నారు. తాను నిజాయతీపరుడిని కాదని భావిస్తే ఎన్నికల్లో ఓటేయద్దని ప్రజలను కోరారు.

మోదీ చర్యలపై ఆర్ఎస్ఎస్‌కు ప్రశ్నలు

ప్రధాని మోదీ చర్యలపై సమాధానం చెప్పాలని ఈ సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్ ఆర్ఎస్ఎస్‌కు అయిదు ప్రశ్నలు సంధించారు. 'కొడుకు తన తల్లి పట్ల తన వైఖరి చూపించే పెద్ద వాడయ్యడా ?' అని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్‌ను ప్రశ్నించారు. కేంద్ర ఏజెన్సీల దుర్వినియోగం, అవినీతి నేతలను పార్టీలో చేర్చుకోవడం, ఆర్ఎస్ఎస్ అవసరం లేదన్న బీజేపీ వైఖరిపై, బీజేపీలో వయోపరిమితి నిబంధనపై ఆర్ఎస్ఎస్ సమాధానం చెప్పాలన్నారు.

ఎస్సీ అట్రాసిటీ కేసుల్లో
97 శాతం పైగా ఆ 13 రాష్ట్రాల్లోనే

- శిక్ష పడిన వారి సంఖ్య తగ్గుముఖం
- నివేదిక విడుదల చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: దేశంలో షెడ్యూల్డ్ కులాల వారిపై 2022లో జరిగిన మొత్తం దౌర్జన్యం కేసులలో 97.7 శాతం కేసులు 13 రాష్ట్రాలలోనే చోటుచేసుకున్నాయి. వీటిలో యూపీ అగ్రస్థానంలో ఉండగా, రాజస్థాన్, మధ్యప్రదేశ్ తర్వాతి స్థానాల్లో ఉన్నట్టు ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. అదే సమయంలో 2020తో పోలిస్తే ఆ ఏడాది కేసులలో శిక్షపడిన వారి సంఖ్య 39.2 నుంచి 32.4 శాతానికి పడిపోయింది. అలాగే షెడ్యూల్డ్ కేస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (దౌర్జన్యాల నివారణ) చట్టం ప్రకారం దేశం మొత్తంలో ఎస్టీలపై 2022లో జరిగిన దౌర్జన్యాలలో 98.91 శాతం 13 రాష్ట్రాలలో నమోదయ్యాయని ప్రభుత్వ తాజా నివేదిక తెలియజేసింది. ఎస్సీలపై 2022లో జరిగిన దౌర్జన్యాలపై మొత్తం 52,886 కేసులకు ఈ 13 రాష్ట్రాలలో 51,566 కేసులు నమోదయ్యాయి. వాటిలో యూపీలో 12,287 (23.78 శాతం), రాజస్థాన్‌లో 8,651 (16.75 శాతం), ఎంపీలో 7,732 (14.97), బీహార్‌లో 6,799 (13.16 శాతం), ఒడిశాలో 3,576 (6.93 శాతం), మహారాష్ట్రలో 2,706 (5.24 శాతం) కేసులు నమోదయ్యాయి. ఇక ఎస్టీలపై 2022లో మొత్తం కేసులు 9,735కు ఎక్కువగా ఎంపీలో 2,979 (30.61శాతం) నమోదయ్యాయి.

పట్టాలపై మరోసారి సిలిండర్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ప్రేమ్‌పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం గ్యాస్ సిలిండర్ కనిపించింది. ఆ మార్గంలో వెళుతున్న గూడ్స్ రైలు లోకో పైలట్ దీనిని గుర్తించి వెంటనే ఎమర్జెన్సీ బ్రేకులు వేయడంతో ప్రమాదం తప్పింది. ట్రాక్‌పై గుర్తించిన అయిదు కిలోల సామర్థ్యం గల ఖాళీ సిలిండర్‌ను తొలగించామని స్థానిక పోలీసులు వెల్లడించారు. అలాగే గుజరాత్‌లోని కిమ్-కోసాంబ మధ్య కిమ్ వంతెన సమీపంలో శనివారం పెను ప్రమాదం తప్పింది. రైల్వే ట్రాక్‌పై సేఫ్టీ పిన్ ఇలాస్టిక్ రైల్ క్లిప్‌ను తొలగించి, గరీబ్ రథ్ రైలును ప్రమాదానికి గురయ్యేలా చేయాలని చేసిన కుట్ర విఫలమైంది. కాగా, ఎంపీలో గత బుధవారం సైన్యం ప్రత్యేక రైలును కొద్దిసేపు ఆపివేయడానికి కారణమైన డిటోనేటర్లను 'హాని రహిత'మైనవిగా రైల్వే అభివర్ణించింది.

భూ పరిహారం వీలైనంత త్వరగా చెల్లించాలి

రాష్ట్ర ప్రభుత్వాలదే ఆ బాధ్యత: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: భూ సేకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నష్ట పరిహారం చెల్లింపు వీలైనంత తొందరగా పూర్తి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల పైనే ఉంటుందని, ఇది రాష్ట్రాల రాజ్యాంగ, చట్టబద్ధమైన బాధ్యత అని గుర్తు చేసింది. ఈ మేరకు ఈ నెల 20వ తేదీన తీర్పును వెలువరించింది. హిమాచల్ ప్రదేశ్ సోలన్ జిల్లా కేంద్రంలో సిమెంట్ కంపెనీ జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ కోసం ప్రభుత్వం 54 ఎకరాల భూమిని సేకరించింది. ఇందులో పరిహారం చెల్లింపు పూర్తి చేయకుండా రాష్ట్ర సర్కార్ సిమెంట్ కంపెనీకి భూమిని స్వాధీనం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన సొంత ఖజానా నుంచి బాధితులకు 9 శాతం వడ్డీతో కలుపుకొని అసలును చెల్లించాలని, అటు తర్వాత ఆ మొత్తాన్ని సదరు సిమెంట్ కంపెనీ నుంచి వసూలు చేసుకోవాలని హిమాచల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది.

లైంగిక దాడి ప్రతిఘటించిందని హత్య

ఆరేండ్ల చిన్నారిపై ప్రిన్సిపల్ దారుణం

దాహూద్ (గుజరాత్), సెప్టెంబర్ 22: పాఠాలు చెప్పి విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన ఓ ప్రిన్సిపల్ దారుణానికి పాల్పడ్డాడు. లైంగిక దాడికి ప్రయత్నించిన తనను అడ్డుకుందనే కోపంతో ఆరేండ్ల బాలికను హతమార్చాడు. గుజరాత్‌లోని దహోడ్ జిల్లా సింగ్‌వాడ్ తాలుకాలోని ప్రాథమిక పాఠశాలలో ప్రిన్సిపాల్ గోవింద్ నాట్ గురువారం స్కూల్‌కు కారులో వస్తున్నాడు. దారిలో ఆరేండ్ల బాలికను కారులో ఎక్కించుకుని ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. బాలిక ప్రతిఘటించి అరవడంతో గోవింద్ నాట్ ఆమె నోరు, ముక్కు మూసి వేశాడు. దీంతో బాలిక స్పృహ తప్పింది. ఆమెను కారులో అలాగే ఉంచి స్కూల్‌కు యధావిధిగా వచ్చాడు. సాయంత్రం ఐదు దాటిన తర్వాత స్పృహలో లేని చిన్నారిని పాఠశాల వెనుకవైపు పడేశాడు. తల్లిదండ్రులు, బంధువులు వచ్చి గాలించగా, స్పృహ తప్పి ఉన్న స్థితిలో బాలిక కన్పించింది. ఆమెను దవాఖానకు తరలించగా మృతి చెందింది. పోలీసులు హెడ్‌మాస్టరే హంతకుడిగా నిర్ధారించి అరెస్ట్ చేశారు.

మసీదు ప్రాంగణంలో బాలికపై రేప్

మసీదు ప్రాంగణంలో ఒక మతాధికారి ఐదేండ్ల బాలికపై లైంగిక దాడి చేసిన ఘటన రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలో చోటు చేసుకుంది. మసీదులో మౌల్విగా పనిచేసే అష్తద్ (22) ఇంటి ఎదురుగా ఉండే ఐదేండ్ల బాలికను మసీదులోకి తీసుకుని వెళ్లి అఘాయిత్యం చేశాడు.

ఫ్రిజ్‌లో 30 ముక్కలుగా మహిళ శవం

బెంగళూరులో వెలుగు చూసిన దారుణం

బెంగళూరు, సెప్టెంబర్ 22: బెంగళూరులో దారుణం జరిగింది. ఓ యువతి మృతదేహాన్ని 30 ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో పెట్టిన ఉదంతం వయాలికావల్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో వెలుగు చూసింది. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో యజమాని చేసిన ఫిర్యాదుతో ఈ దారుణం శనివారం బయటపడింది. పోలీసులు ఇంటి లోపలకు ప్రవేశించి ఫ్రిజ్‌లో 30 ముక్కలుగా నరికి ఉన్న ఒక యువతి మృతదేహాన్ని చూసి షాక్ తిన్నారు. ఈ ఘటన జరిగి నాలుగైదు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నట్టు వెస్ట్ జోన్ అడిషనల్ కమిషనర్ ఎన్ సతీశ్ కుమార్ తెలిపారు. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం మృతురాలిని జార్ఖండ్‌కు చెందిన 29 ఏండ్ల మహాలక్ష్మిగా గుర్తించారు. హేమంత దాస్ భార్య అయిన ఆమె ఐదు నెలల క్రితం భర్తతో గొడవపడి వచ్చి ఆ ఫ్లాట్‌లో ఒంటరిగా నివసిస్తున్నది. ఆమె భర్తను పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

తాజ్‌మహల్ గోడలకు పగుళ్లు

పలు చోట్ల దెబ్బ తిన్న ఫ్లోరింగ్ • తీవ్ర సమస్యలు లేవన్న ఏఎస్ఐ

ఆగ్రా, సెప్టెంబర్ 22: ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటిగా పేరొంది, పర్యాటకులను విపరీతంగా ఆకర్షించే ఆగ్రాలోని తాజ్‌మహల్ లోపభూయిష్టమైన నిర్వహణతో నిర్లక్ష్యానికి గురవుతున్నది. ఫలితంగా ఈ పాలరాతి కట్టడంలోని గోడలు, ఫ్లోరింగ్ పలుచోట్ల దెబ్బతినడమే కాక, పగుళ్లు కూడా దర్శనమిస్తున్నాయి. ఇటీవల ఆగ్రాలో కురిసిన భారీ వర్షం కారణంగా ఇవి మరింత పెరిగినట్టు భావిస్తున్నారు. గతంలో ప్రధాన గోపురం చుట్టూ ఉన్న తలుపులపై అరబిక్‌లో ఖురాన్ శ్లోకాలు ఉండేవి. ఇప్పుడవి చెరిగిపోయాయి. గోడలలో పొదిగిన విలువైన రాళ్లు కూడా అవసాన దశకు చేరుకుంటున్నాయని టూరిస్ట్ గైడ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి షకీల్ చౌహాన్ తెలిపారు. పశ్చిమ దిశలో కట్టడానికి ఎదురుగా ఉన్న ఫ్లోరింగ్‌పై రాళ్ల ముక్కలయ్యాయని, ప్రధాన సమాధి ప్రాంతం, ప్రధాన గుమ్మటం వద్ద గోడలు దెబ్బతిన్నాయని చెప్పారు. ప్రస్తుతం తాజ్‌మహల్ కట్టడానికి సంబంధించి ఎలాంటి తీవ్ర సమస్యలు లేవని తాజ్‌మహల్ నిర్వహణను చూస్తున్న భారత పురావస్తు సంస్థ (ఏఎస్ఐ) స్పష్టం చేసింది. కాగా, ఇటీవల కురిసిన భారీ వర్షానికి తాజ్‌మహల్ ప్రధాన గుమ్మటం నుంచి నీరు కారడమే కాక, కట్టడం ముందున్న తోట నీట మునిగిన విషయం తెలిసిందే.

17 ఏండ్ల క్రితం కిడ్నాప్‌కు గురై..
ఇప్పుడు లాయర్‌గా కేసు గెలిచి..

- తన కేసును తానే వాదించుకున్న బాధితుడు
- 14 మంది నిందితుల్లో 8 మందికి జీవిత ఖైదు

ఆగ్రా, సెప్టెంబర్ 22: ఆగ్రా జిల్లాలోని ఖేరాగఢ్‌లో 17 ఏండ్ల క్రితం కిడ్నాప్‌కు గురైన ఓ బాలుడు.. ఇప్పుడు లాయర్‌గా ఎదిగాడు. ఆపై తన అపహరణ కేసులో తానే తుది వాదనలు వినిపించి, ఆ కిడ్నాపర్లకు జీవిత ఖైదు పడేలా చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. 2007 ఫిబ్రవరి 10వ తేదీ సాయంత్రం కొందరు దోపిడీదారులు ఖేరాగఢ్‌లోని ఓ మెడికల్ షాపుపై దాడికి పాల్పడ్డారు. ఆ షాపు యజమానిపై కాల్పులు జరిపి, ఆయన కుమారుడ